వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ఉయ్యూరు: ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. శీతాకాలంలో చలి నుంచి వృద్ధులు, పేదలకు రక్షణ కల్పించేందుకు దుప్పట్లు పంపిణీ చేశామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ విస్తరణకు ప్రోత్సాహకం

గన్నవరం రూరల్: ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల హార్టికల్చర్ అధికారి ఇ.హరిచంద్ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సాగు చేసే రైతులకు హెక్టారుకు 143 మొక్కలు ఉచితంగా అందిస్తామన్నారు. ఒక్కొక్క మొక్క రూ.193 వ్యయం అవుతుందన్నారు. హెక్టారుకు రూ.27,599 రైతుకు ఉచితంగా అందుతుందని చెప్పారు.

రెండు దుకాణాల్లో చోరీకి యత్నం

కంకిపాడు: రెండు దుకాణాల్లో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. సేకరించిన వివరాల మేరకు.. గోసాల ప్రధాన సెంటరులోని ఓ నూడిల్స్‌దుకాణం, కూల్‌డ్రింక్స్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ యత్నం చేశారు. మంగళవారం అర్ధరాత్రి తరువాత చోరీ జరిగినట్లు దుకాణదారులు భావిస్తున్నారు. కూల్‌డ్రింక్స్ బడ్డీ పగలకొట్టి ఫ్రిజ్‌ను స్వల్పంగా ధ్వంసం చేశారు. నూడిల్స్ దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాలను చోరీ చేసినట్లు తెలుస్తోంది. ముందుగా ఈడుపుగల్లు బీసీ కాలనీ ఎదురుగా విద్యుత్ టవర్ వద్ద ఉన్న కేబుల్ వైర్లకు నిప్పుపెట్టి చోరీయత్నానికి పాల్పడ్డారని సమాచారం. బుధవారం ఉదయం దుకాణాలను తెరిచేందుకు యజమానులు వచ్చి చూడగా చోరీ యత్నం చేసినట్లు గుర్తించారు. ఈ విషయమై ఎస్‌ఐ డి.సందీప్‌ను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా వివరాలు సేకరిస్తామని తెలిపారు.

నూతన ఆవిష్కరణలతో మేధాశక్తిని ప్రదర్శించాలి

పెనమలూరు: వైజ్ఞానిక ప్రదర్శనలను వేదికగా చేసుకొని నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు మేధాశక్తిని ప్రదర్శించాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస్ చెప్పారు. ఏపీ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పోరంకిలో బుధవారం రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో స్టెమ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ప్రావీణ్యత సాధించే విధంగా చర్యలు చేపడతామన్నారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 26 జిల్లాల నుంచి 3 విభాగాలైన వ్యక్తిగత, టీమ్ విభాగం, ఉపాధ్యాయ విభాగంలో మొత్తం 156 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో 15, టీమ్ విభాగంలో 10, ఉపాధ్యాయ విభాగంలో 10 అత్యున్నత ప్రాజెక్టులు ఎంపిక చేశామని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరగనున్న దక్షిణ భారత దేశ విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ప్రదర్శనలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

తీర్మానాలు లేకుండా పనులు ఎలా చేస్తారు?

విజయవాడరూరల్: మండల, పంచాయతీ సమావేశాల్లో తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తారని, ఈ పనులకు ఇంజినీరింగ్ అధికారులు ఎలా సమర్థిస్తారని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, ప్రత్తిపాటి రవీంద్ర ప్రశ్నించారు. బుధవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. నున్న గ్రామం కోటకట్ట సెంటర్ వద్ద లక్షలాది రూపాయల విలువగల ప్లాటుఫామ్ నిర్మాణ పనులకు మండలం, నున్న గ్రామ పంచాయతీ నుంచి నిధులు మంజూరు కాలేదని, ఎలాంటి అనుమతులు లేకుండా అధికారపార్టీ నాయకులు చేస్తున్న పనికి ఇంజినీరింగ్ సిబ్బంది దగ్గర ఉండి ఎలా పర్యవేక్షిస్తారని ఎంపీటీసీ సభ్యులు అడిగారు. గత ప్రభుత్వంలో నున్న గ్రామం ఎస్సీ ఏరియాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు మండల పరిషత్ నిధులు మంజూరు చేసినా ఇంత వరకు పనులు ఎందుకు చేయలేదని ప్రత్తిపాటి రవీంద్ర అడిగారు. నున్న కోటకట్ట సెంటర్లో చేస్తున్న ప్లాటుఫామ్ నిర్మాణ పనులకు మండలం, గ్రామ పంచాయతీ నుంచి నిధులు మంజూరు చేయడం జరగదని ఎంపీపీ, ఎంపీడీఓ సమావేశంలో తేల్చి చెప్పారు. మిగిలిన రెండు రోడ్ల నిర్మాణ పనులు చేసేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. దాళ్వాసాగు లో అవసరమైన డీఏపీ ఎరువు, సొసైటీల్లో, రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో లేవని, బస్తాకు రూ.వంద అదనంగా చెల్లించి బయట దుకాణాల్లో కొనాల్సివచ్చిందని, వ్యవసాయ అధికారులు ఏమి చేస్తున్నారని ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. వ్యవసాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో వ్యాపారులు తమకిష్టమొచ్చినట్టుగా అమ్ముతున్నారన్నారు. ప్రసాదంపాడు గ్రామంలో అభివృద్ధి పనులు జరగడంలేదని ఎంపీటీసీ సభ్యురాలు గుజ్జర్లపూడి అబిత అధికారులను అడిగారు. అండర్ గ్రౌండ్ వాటర్ కలుషితమై తాగునీరు లభించే పరిస్థితి ఉందన్నారు. మండల, జెడ్పీ నిధులు మంజూరు చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ సభ్యుడు దూరు రత్నం గ్రామంలో తాగు నీటి సమస్య ఉందని, ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో బోర్ల ద్వారా మాత్రమే తాగునీరు అందుబాటులో ఉందని, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచలన మేరకు కృష్ణానది నుంచి తాగునీరు అందించేందుకు ప్రాజెక్టు సిద్ధం చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, రవీంద్ర

కోడిపందేలకు అనుమతుల్లేవని గ్రామాల్లో కోడి పందేలు వేస్తే చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ బి.సుగుణ వెల్లడించారు. కోడి పందేలు వేసిన వారికి, పాల్గొన్న వారికి, పొలం యజమానులకు చట్టారీత్యా శిక్షలు ఉంటాయని టూటౌన్ సీఐ సీహెచ్. కొండలరావు హెచ్చరించారు. ఉపాధి పథకం కింద పశువుల షెడ్ల నిర్మాణంలో ఇంజినీరు కన్సల్టెంట్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని కొత్తూరు తాడేపల్లి సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, పైడూరుపాడు సర్పంచి వేమూరి సీతారామయ్య సమావేశంలో వెల్లడించారు. ఎంపీడీఓ విగ్గిన్స్ తాను ఫీల్డ్‌కు వచ్చి పరిశీలిస్తానని తెలిపారు.

సభ్యులు లేకుండా బడ్జెట్ అంచనాలు..

సమావేశంలో బడ్జెట్ అంచనాల సమాచారాన్ని తొలివిడతగా ప్రవేశపెట్టాల్సి ఉండగా అధికారులు సభ్యులు అందరూ సమావేశం హాలు నుంచి వెళ్లిన తర్వాత ఏఓ కృష్ణప్రసాద్ చదివి వినిపించారు. 2024- 25 సవరించిన బడ్జెట్ అంచనాలు, 2025- 26వ సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు రూ.4కోట్ల 43 లక్షల 60 వేలు ప్రతిపాదించారు. 2024- 25 సంవత్సరపు బడ్జెట్ సవరణ అంచనా రూ.4కోట్ల 33 లక్షల 50 వేలుగా రూపొందించారు. పలు శాఖలపై సమీక్షించారు. సర్పంచ్‌లు, అధికారులు, కోఆప్షన్ సభ్యుడు అల్తాఫ్, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, సభ్యులు పాల్గొన్నారు.

అర్హులకు నివేశన స్థలాలు ఇవ్వాలి

గన్నవరం: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేసేందుకు అవసరమైన భూములను ప్రభుత్వం సేకరించాలని వ్యవసాయ కార్మిక సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని అల్లాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు పంపిణీ చేస్తామనే హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని చెప్పారు. ఇళ్ల స్థలాల కోసం ఈ నెల 10న తహసీల్దారు కార్యాలయాల వద్ద సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సంఘ నేతలు కొండా వీరాస్వామి, తిరివీధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు: సెమిస్టర్ ఫలితాల్లో కలవపాముల జ్యోతి పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విశేష ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపాల్ జె.శివ కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ 2024- 25 విద్యాసంవత్సరానికి ఎస్‌బీటీఈటీ అక్టోబరు, నవంబరు నెలల్లో నిర్వహించిన రెండు, మూడో సెమిస్టర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌లో శ్రావణి 99.4 శాతం, నవ్యశ్రీ 98.8 శాతం, హర్షిణి 97.6 శాతం, క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్ డేటాలో లక్ష్మీకాంత్ 98 శాతం, మోహనకృష్ణ 96 శాతం, నాగలక్ష్మి 95.5 శాతం, కంప్యూటరింగ్ ఇంజినీరింగ్‌లో దివ్యశ్రీ, మాధురి 99.2 శాతం, లోకేష్‌రెడ్డి, సాన్య 99 శాతం, తేజస్విని 98.2 శాతం, సివిల్ ఇంజినీరింగ్‌లో లక్ష్మీనీరజ 90 శాతం, భరత్‌కుమార్‌రెడ్డి 84 శాతం, భరత్‌కుమార్ 82 శాతం, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో చిరు చరణ్ 97 శాతం, వెంకట లావణ్య, స్టీఫెన్ 96.3 శాతం, అనుస్పందన 93.6 శాతం, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో దేవేందర్‌రెడ్డి 98.5 శాతం, రామేశ్వర్ 97.6 శాతం గోకర్‌వలీ 93 శాతం, మెకానికల్‌లో బాషా 95.3 శాతం, ఫయాజ్‌బాషా 89.6 శాతం, విష్ణుతేజ 79 శాతం సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందాన్ని కళాశాల కరస్పాండెంట్ సూరపనేని వెంకట రమణ ప్రత్యేకంగా అభినందించారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల రక్తదానం

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్ర ఆస్పత్రి డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ ప్రమాదంలో ఉన్న వ్యక్తులను కాపాడేందుకు రక్తదానం చేయటం చాలా అవసరమన్నారు. రక్తదానంతో మరో ప్రాణం కాపాడ గలుగుతామని వివరించారు. రక్తదానం చేయటం వలన ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. దాదాపు 40 మంది విద్యార్థులు రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదాతకు సర్టిఫికెట్ ఇస్తున్న నిర్వాహకులు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



తాతాపురం విద్యార్థులకు భోగి పండ్లు పోస్తున్న హెచ్‌ఎం సత్యవాణి, ఉపాధ్యాయులు



వీరపనేనిగూడెంలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులతో ప్రిన్సిపాల్ యశోదలక్ష్మి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు తాతాపురం మండల పరిషత్ పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సందడి చేశారు. తొలుత దాత తిపుర్నేని రాఘవ ప్రసాద్ భోగి మంటలను వెలిగించి సంబరాలను ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో రంగువల్లులను తీర్చిదిద్దారు. విద్యార్థులకు బోగిపండ్లు పోశారు. విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియపరిచారు. హెచ్‌ఎం గోదావరి సత్యవాణి, ఉపాధ్యాయులు తదిదరులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: తెలుగు సంస్కృతికి ప్రతీక సంక్రాంతి అని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి అన్నారు. బుధవారం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు విద్యార్థినులతో ఘనంగా నిర్వహింపజేశారు. గురుకుల పాఠశాల ఆవరణ సంక్రాంతి శోభను సంతరించుకుంది. విద్యార్థినులు పట్టుపరికిణీలు, లంగా ఓణీలు, నడుముకు వడ్డాణాలు, చేతులకు గోరింటాకులు, భోగి మంటలు, భోగి పండ్లు, పాయసం, స్వీట్లతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు ఉషారాణి, రాజకుమారి, ఉదయలక్ష్మి, రజని ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

పెనమలూరు: కానూరులో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని మృతి చెందటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో నన్నపనేని రజిత భర్త వెంకటేశ్వరరావుతో(44) నివాసం ఉంటుంది. వీరికి వివాహం జరిగి 16 ఏళ్లు అయ్యింది. పిల్లలు లేరు. భర్త రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాడు. ఈ నెల 6వ తేదీన భార్య గన్నవరం పుట్టింటికి వెళ్లేందుకు భర్త రామవరప్పాడులో ఆమెను ఆటో ఎక్కించాడు. ఆ తరువాత భర్త మురళీనగర్ ఇంటికి చేరుకున్నాడు. అదే రోజు రాత్రి భార్య భర్తతో ఫోన్‌లో మాట్లాడింది. 7, 8వ తేదీల్లో రజిత వెంకటేశ్వరరావుకు ఫోన్ చేయగా అతను ఫోన్ లిఫ్టు చేయలేదు. దీంతో భర్త మిత్రుడైన వినయ్‌ను ఇంటికి వెళ్లి చూడమని రజిత కోరింది. వినయ్ బుధవారం వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరిచి చూడగా వెంకటేశ్వరరావు తాడుతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే అనుచరులమంటూ అగడాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మండలంలోని ముస్తాబాదలో మట్టి లారీలను అడ్డుకోబోయి దేహశుద్ధి చేయించుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అనుచరులైన పరుచూరి నరేష్ అగడాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే అండదండలు చూసుకుని నరేష్‌తో పాటు నూతక్కి సునీల్, మరి కొంత మంది తెలుగుయువత నేతలు కొంత కాలంగా రెచ్చిపోతున్నారు. వ్యవస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని యథేచ్ఛగా ప్రైవేట్ సెటిల్‌మెంట్లు, దందాలు సాగిస్తున్నారు. సొంత పార్టీ నేతలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడడం వివాదస్పదమైంది. వైన్‌షాపుల లైసెన్స్‌ల విషయంలో సిండికేట్‌గా ఏర్పడి సొంత పార్టీ నేతలతో పాటు బయట వ్యక్తులు దరఖాస్తులు వేయకుండా పరుచూరి నరేష్ వర్గం బెదిరింపులకు దిగారు. మద్యం షాపునకు దరఖాస్తు చేసేందుకు వచ్చిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడైన 73 ఏళ్ల కంచర్ల ఈశ్వరరావుపై స్థానిక ఎక్సైజ్ ఆఫీస్ వద్ద పరుచూరి నరేష్ ఏకంగా భౌతిక దాడికి దిగాడు. ఈ విషయమై ఎమ్మెల్యే యార్లగడ్డకు ఈశ్వరరావుతో పాటు ఆయన వర్గీయులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే సైతం నరేష్‌కు మద్దతుగా నిలవడంతో ఈశ్వరరావు వర్గం కంగుతింది. సిండికేట్‌లో కలవని వైన్‌షాపుల యాజమానులపై వేదింపుల పర్వం కొనసాగించారు. సిండికేట్‌లో కలవకపోతే వైన్‌షాపుల్లో వాటాలు ఇవ్వాలని బెదిరింపులకు దిగడంతో కొంత మంది వ్యాపారులు భయంతో తలొగ్గాల్సి వచ్చింది. గన్నవరంలో దీపావళి బాణసంచా స్టాల్స్ నిర్వాహకుల నుంచి అధికారులకు మామూళ్ల పేరుతో ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా రూ.లక్షల్లో వసూలు చేయడం గమనర్హం. మైనింగ్, మట్టి విషయంలో నరేష్ అనుచరగణం మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఎవరైన తమకు చెప్పకుండా గ్రావెల్, మట్టి తరలిస్తే దాడులకు దిగుతున్నారు. ముస్తాబాదలో జరిగిన సంఘటన ఒక ఉదాహరణ. ఓ ప్రైవేట్ వెంచర్‌లోని నల్ల మట్టిని వేరే స్థలంలోకి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకోవడంతో పాటు దౌర్జన్యానికి దిగడం గొడవకు దారితీసింది. దీంతో అగ్రహానికి గురైన మట్టి కాంట్రాక్టర్ వర్గం నరేష్‌తో పాటు తెలుగు యువత నేత సాయిరాంను చితకబాదడం నియోజకవర్గంలో సంచలనంగా మారింది. అవినీతి, అక్రమాలకు వ్యతిరేకమని చెబుతున్న యార్లగడ్డ ఇటువంటి రాజ్యాంగేతర శక్తులను ప్రోత్సహించడంపై సొంత పార్టీ నేతలు విస్తుపోతున్నారు. ఇటువంటి వ్యక్తులను కట్టడి చేయకపోతే ఎమ్మెల్యేకు, పార్టీకి నష్టం వాటిల్లుతుందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

గన్నవరం రూరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. అధ్యక్షుడు మదుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి కర్రా వర ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లనపల్లి, సూరంపల్లి, వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో, ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మానవతా ప్రతినిధులు వీసం ప్రసాదరావు, సయ్యద్ లాల్, గన్నె వెంకట్రావు, పలగాని శివాజీ, వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ఉయ్యూరు: ఈనెల 12న సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని సుదీర్ టింబర్స్ అధినేత నూకల వెంకట సాంబశివరావు అన్నారు. పట్టణంలోని వంశీ రియల్ సిటీలో తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాల పోస్టరును బుధవారం ఆవిష్కరించారు. సాంబశివరావు మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే సంబరాలకు ప్రజలందరూ హాజరుకావాలన్నారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు అందిస్తామన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి ఉంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలో రెండు జట్లకు ప్రథమ స్థానం

పెనమలూరు: పోరంకిలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో రెండు జట్లు విజేతలుగా నిలిచాయి. గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీలో స్పైక్ విజయవాడ జట్టు, గన్నవరం జట్లకు సమానంగా 18 పాయింట్లు చొప్పున వచ్చాయి. దీంతో రెండు జట్లను విజేతలుగా ప్రకటించి బహుమతి అందజేశారు. రెండో స్థానంలో ప్రమోద్ ఎఫ్‌సీ జట్టు గెలిచింది. బెస్టు రైడర్‌గా పవన్, డిఫెండర్‌గా అశోక్‌కు బహుమమతులు అందజేశారు. రెఫరీగా విజయ్‌కుమార్ వ్యవహరించగా, టోర్నమెంట్‌ను చోడగుడి రాజేష్, రాఘవేంద్ర, బి.శ్రీకాంత్, సీహెచ్.సుధారాజు ఆర్గనైజ్ చేశారు.

మట్టిటిప్పర్ల ఘటనపై కేసు నమోదు

గన్నవరం: మండలంలోని ముస్తాబాదలో మట్టి టిప్పర్లను అడ్డుకున్న సంఘటనకు సంబంధించి ఒక వర్గం నేతలపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. ముస్తాబాద గ్రామంలో గత సోమవారం అర్ధరాత్రి మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్లను తెలుగు యువత నేతలు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ముస్తాబాదకు చెందిన టీడీపీ నేతలైన కంచర్ల శివ వర్గం, తెలుగు యువత నేతలు పరుచూరి నరేష్, కొసరాజు సాయిరాం వర్గం పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలపై ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేసుకున్నారు. అయితే రైల్వే భూభాగం నుంచి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు కంచర్ల శివ, మురళి, రాజీవర్మ, రంగు కళ్యాణ్, మాచినేని విజయ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఆరు టిప్పర్లను సీజ్ చేసినట్లుగా ఎస్‌ఐ చెప్పారు.

విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: కానూరు మురళీనగర్‌లో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మురళీనగర్‌లో విద్యార్థిని (20) కుటుంబం ఉంటోంది. ఆమె విజయవాడలో డిగ్రీ చదువుతోంది. కాగా ఈ నెల 6న రాత్రి తల్లి పక్కనే మంచంపై పడుకుంది. అయితే 7వ తేదీన లేచి చూసుకునేసరికి కుమార్తె కనిపించలేదు. ఈ ఘటనపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువులు తక్కువగా వాడాలి

పెనమలూరు: రైతులు ఎరువులు తక్కువగా వాడి నాణ్యమైన పంట దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఎన్.పద్మావతి అన్నారు. వణుకూరు, గోసాల గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇచ్చారు. పద్మావతి మాట్లాడుతూ మొక్కజొన్నకు కాండం కుళ్లు తెగులు వస్తుందని జీవశిలీంద్రం వాడితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఎంఏవో కనకమేడల శైలజ, వీఏఏలు చాముండేశ్వరి, కరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

అక్రమణలు తొలగించాలని వినతి

గన్నవరం: మండలంలో గన్నవరం- ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రహదారి అక్రమణలు తొలగించాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అధికారులకు రోడ్డు అక్రమణలు తొలగించాలని వినతిపత్రం సమర్పించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చిక్కవరం, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, బీబీ.గూడెం వెళ్లే నాలుగు రోడ్ల సెంటర్ వద్ద అక్రమణలు పెరిగాయని చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా బడ్డీకొట్లు, ఇతర దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారడంతోపాటుప్రమాదాలుఎక్కువగా జరుగుతన్నాయన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఆందోళన



ఉయ్యూరులో ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

ఉయ్యూరు: విద్యుత్ చార్జీల పెంపును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేష్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఉయ్యూరు పట్టణంలోని 12వ వార్డులో బుధవారం ఆందోళన చేపట్టారు. రాజేష్ మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్‌భారాలను మోపటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పడాల లక్ష్మణ రావు, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఉయ్యూరు: పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సూచించారు. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ పది పరీక్షలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో ముందుకు వచ్చే దాతలను ప్రోత్సహించి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. డీసీఈబీ సెక్రటరీ షేక్ జాన్ సాహెబ్, డీవైఈఓ పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ అందరూ పాటించాలి

పెనమలూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటనారాయణ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా తాడిగడప జంక్షన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రమాదాలు నివారించగలుగుతామన్నారు. చాలా మంది వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించటం లేదని తాము గమనించామని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం, ట్రిపుల్ రైడింగ్, వేగంగా వాహనాలు నడపటం, హెల్మెట్ ధరించక పోవటం, సిగ్నల్ లైట్స్‌ను అనుసరించక పోవటం వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు నివారించటమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.


తాడిగడప జంక్షన్ వద్ద ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో సీఐ వెంకటనారాయణ

అభివృద్ధి పథంలో గన్నవరం ప్రాంతం



గన్నవరం: విజయవాడకు అతిసమీపంలో ఉన్న గన్నవరం ప్రాంతం విద్య, వైద్యం, వ్యాపారం, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాల పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీనికితోడు గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా లభించడంతో ఈ ప్రాంతం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఒకప్పుడు వ్యవసాయ ఆధారితమైన ఈ ప్రాంతంలో ఎన్టీఆర్ పశువైద్య కళాశాల, కేసరపల్లి వద్ద ఐటీ పార్కు, చిన్నఆవుటపల్లి వద్ద పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ఏర్పాటుతో ఆధునికత సంతరించుకుంది. దేశీయ ఐటీ దిగ్గజమైన హెచ్‌సీఎల్ సంస్థ కూడా గన్నవరం సమీపంలో క్యాంపును ప్రారంభించింది. విద్య, వైద్య రంగంలోనూ ఈ ప్రాంతం ప్రత్యేకతను సంతరించుకుంది. గత ఐదేళ్లలో వైద్య రంగంలోని పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణలు ఇక్కడ అందుబాటులో ఉన్నారు. గన్నవరం ప్రాంతంలో అరవింద్ హాస్పటల్స్, భారతి కంటి ఆస్పత్రి, నరేంద్ర దంత వైద్యశాల, ప్రాణహిత హాస్పిటల్స్ వంటి ఆర్థోపెడిక్, కంటి, దంత, గైనకాలజీ, కార్డియాలజీ, పీడియాట్రిక్స్‌కు సంబంధించి సుమారు 25కు పైగా ఆస్పత్రులను ఏర్పాటు చేసి కార్పొరేట్ తరహా వైద్య సేవలందిస్తున్నారు. విద్యా పరంగా వీఎస్.సెయింట్‌జాన్స్ హైస్కూల్, స్రవంతి హైస్కూల్, శ్రీసాయి శ్రీనివాస హైస్కూల్, విశ్వభారతి నవోదయ కోచింగ్ సెంటర్‌తో పాటు అనేక కార్పొరేట్ స్కూల్స్, కళాశాలలను ఏర్పాటు చేశారు. వ్యాపార పరంగా సూపర్ మార్కెట్‌లు, హోల్‌సెల్ దుకాణాలు, ఎలక్ట్రానిక్స్ షాపులు, టూ వీలర్స్ షోరూమ్స్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. త్రీస్టార్ హోటల్స్, హోటల్స్, రెస్టారెంట్లు విస్తరిస్తున్నాయి. పారిశ్రామికంగా చిన్నఆవుటపల్లి, తెంపల్లి, సూరంపల్లి గ్రామాల పరిధిలో వందలాది పరిశ్రమలు, గిడ్డంగులను ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. రానున్న కాలంలో మరింత పట్టణీకరణను సంతరించుకునే దిశగా గన్నవరం ప్రాంతం అడుగులు వేస్తుంది.

విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ రంగం

గన్నవరం ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా విస్తరిస్తోంది. గన్నవరం, కేసరపల్లితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. బహుళ అంతస్తుల భవనాలు, అత్యాధునిక సదుపాయాలతో కూడిన విల్లాలు, వందలాది ప్లాట్ల సముదాయంతో కూడిన గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. విజయవాడకు అతి సమీపంలో గన్నవరం ప్రాంతం ఉండడంతో ఇక్కడ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.



భారతి కంటి వైద్యశాల


అరవింద హాస్పటల్


గన్నవరం హైవే



స్రవంతి హైస్కూల్

కార్పొరేట్ వైద్య సేవలు



వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా ఈ ప్రాంత ప్రజలకు అధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడే ఖరీదైన అత్యాధునిక వైద్య పరికరాలతో పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఎమర్జెన్సీ, 24 గంటల వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. కంటి వైద్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆధునిక వైద్య సేవలందిస్తున్నాం.

– డాక్టర్ దుగ్గిరాల వరుణ్

అందుబాటులో ప్రత్యేక వైద్య సేవలు



వైద్య పరంగా ఈ ప్రాంతం వేగంగా వృద్ధి చెందుతోంది. గతంతో పోల్చితే అన్ని రకాల వైద్య సేవలు, ఆస్పత్రులు ఇక్కడ అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ఖర్చుకే కార్పొరేట్ తరహాలో అత్యాధునిక వైద్య సేవందిస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా పనిచేస్తున్నాం.

– డాక్టర్ సూరెడ్డి అరవింద్, గన్నవరం

మెరుగైన వైద్య సేవలు



వైద్యుడు నిరంతర సమాజ సేవకుడు. వైద్య రంగంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా వైద్య సేవలు ఇప్పుడు గన్నవరంలో అందుబాటులో ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల జబ్బులను నయం చేసే విధంగా ప్రత్యేక స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నారు. మెదడు, నరములకు సంబంధించి తమ ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నాం.

– డాక్టర్ తోట నవీన్, మెదడు, నరముల వైద్య నిపుణులు, ప్రాణహిత హాస్పిటల్, గన్నవరం

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం



గతంలో పోల్చితే విద్యా రంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. విద్యార్థులను కేవలం చదువులకే పరిమితం చేయకుండా క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాల్లో పోత్సహించాలి.

– కేజీఎస్.సాయిబాబు, ప్రిన్సిపాల్, శ్రీసాయి శ్రీనివాస హైస్కూల్, పెద్ద ఆవుటపల్లి